

# గణగణ మోగిన గంట

## - కొమ్మూరి సాంబశివరావు



*(గత సంచిక తరువాయి)*

17

**రామచంద్రరావు** శవం మెట్ల దగ్గరే ఉన్నది. ఒక కానిస్టేబుల్ శవానికి కొంచెం దూరంలో నిలుచున్నాడు. సర్కిల్ ఇన్‌స్పెక్టరూ, యుగంధరూ, రాజూ, సబ్‌ఇన్‌స్పెక్టరూ శవం ఉన్న చోటుకి వెళ్ళారు. శ్రీనివాసరావు వాళ్ళతో వెళ్ళలేదు.

"రిపోర్టు ఇవ్వగానే వచ్చాను. అప్పట్నించీ ఇక్కడికి ఎవ్వర్నీ రానివ్వలేదు. కానిస్టేబుల్ని కాపలా ఉంచాను" అన్నాడు సబ్‌ఇన్‌స్పెక్టర్. రాఘవయ్య తల ఊపాడు.

యుగంధర్ శవాన్ని సమీపించాడు. నిలుచునే శవాన్ని రెండు నిమిషాలపాటు పరీక్షగా చూశాడు. తర్వాత రాజువైపు తిరిగి "వెళ్ళి కెమెరా తీసుకురా!" అన్నాడు.

"ఫోటోగ్రాఫర్‌కి కబురు పంపుదామనుకుంటున్నాను. మీరు ఫోటోలు తీసేటట్లయితే అవసరం ఉండదు. నాకు కాపీలు యిస్తారు కదూ!" అన్నాడు సర్కిల్ ఇన్‌స్పెక్టర్.

యుగంధర్ తల ఊపి, మోకాళ్ళ మీదికి వొంగి శవం మెడ పరీక్షగా చూశాడు. "చావుకి కారణం యెవరో గొంతు నలపడమే. లక్షణాలన్నీ అలాగే ఉన్నాయి. మరేదయినా కారణం కూడా ఉన్నదేమో శవ పరీక్ష జరిగితే కాని తెలియదు" అన్నాడు.

"మెడమీద నల్లగా ఉన్న ఆ గుర్తులు హత్యచేసిన మనిషి వేళ్ళ గుర్తులేనా?" అడిగాడు రాఘవయ్య.

"ఈ గుర్తులనిబట్టి వేళ్ళు చాలా లావుపాటివై ఉండాలని తెలుస్తోంది" అంటూ యుగంధర్ తన చేతివేళ్ళు పరీక్షగా చూశాడు.

రాఘవయ్య కూడా శవం మెడమీది గుర్తులు పరీక్షగా చూసి, తర్వాత యుగంధర్ చేతి వేళ్ళు చూసి "అవును. మీ వేళ్ళే చాలా లావు. మీ వేళ్ళకి దాదాపు రెండింతలు లావు ఉండి ఉండాలి" అన్నాడు యుగంధర్.

సబ్‌యిన్‌స్పెక్టర్ నవ్వి "అందరిలోకి శ్రీనివాసరావుగారే కాస్త ధాటిగా ఉన్న మనిషి" అన్నాడు.

అంతలో రాజు కెమెరాతో ఫ్లాష్ గన్‌తో వచ్చాడు. శవాన్ని వేరే వేరే కోణాలనించి ఫోటోలు తీశాడు. ముఖ్యంగా మెడ, మెట్ల కింద గూడు వివిధ కోణాలలోంచి ఫోటోలు తీశాడు.

"టార్చి కూడా తెచ్చావా! గుడ్ ఇలా తే" అన్నాడు యుగంధర్.

ఆరుసెల్స్ ఉన్న పొడుగాటి టార్చి అది. దాని వెలుగులో మెట్ల కింది గూడుని పరీక్షగా చూశాడు. "బూజు లేదు, దుమ్ము లేదు. ఈ యింట్లో పనిమనిషి చాలా శ్రద్ధగా యిల్లు ఊడుస్తుందనుకుంటాను" అన్నాడు యుగంధర్ గూడు కిందినించి వచ్చేసి. సర్కిల్ ఇన్‌స్పెక్టరూ, సబ్ ఇన్‌స్పెక్టరూ యుగంధర్ని ప్రశ్నార్థకంగా చూశారు.

"అడుగుజాడలు ఇత్యాది సూచనలు ఏవీలేవు" అన్నాడు యుగంధర్.

సర్కిల్ యిన్‌స్పెక్టర్ "శీనూ!" అని కేకవేశాడు. రెండు నిమిషాలలో శ్రీనివాసరావు లోపలనించి వచ్చాడు.

"శవాన్ని శవపరీక్షకి పంపే ఏర్పాటు చేస్తాను" అన్నాడు సర్కిల్ ఇన్ స్పెక్టర్.

శ్రీనివాసరావు తల ఊపాడు.

నారాయణస్వామి ఆదేశాలు ఇచ్చి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావువైపు తిరిగి "స్టేట్‌మెంట్ వ్రాసి యిస్తావా?" అడిగాడు.

శ్రీనివాసరావు తలవూపి యుగంధర్‌వైపు తిరిగాడు.

"మీరిందాక చెప్పిన విషయాలన్నీ రాజు వ్రాసుకున్నాడు. నేను ఉండవలసిన అవసరం లేదు" అన్నాడు యుగంధర్.

"కిట్టూ!" అని పిలిచాడు శ్రీనివాసరావు.

"ఆఁ!" అంటూ క్రిష్ణమూర్తి తలుపు వద్దకు వచ్చి నిలబడ్డాడు.

"యుగంధర్నీ, రాజునీ లోపలికి తీసుకువెళ్ళు. కాఫీ ఇప్పించు. రాఘవయ్యకి కూడా కాఫీ పంపించు. నీ గదిలో వాళ్ళకి బస ఏర్పాటు చెయ్యి" అని రాఘవయ్యతో పక్కగదిలోకి వెళ్ళాడు శ్రీనివాసరావు.

వీరయ్యను పిలిచి సామానులు మేడమీద తన గదిలోకి తీసుకువెళ్ళమని చెప్పి, హాల్లోంచి రెండు కుర్చీలు, ఒక పడక కుర్చీ తెచ్చి తన గదిలో పెట్టాడు క్రిష్ణమూర్తి. సుధాకర్ రెండు కప్పుల కాఫీ తెచ్చి బల్లమీద పెట్టాడు.

"మీకేదయినా కావలసి వస్తే పిలవండి" అన్నాడు క్రిష్ణమూర్తి. యుగంధర్ తల ఊపాడు. క్రిష్ణమూర్తి వెళ్ళిపోయాడు.

కాఫీ తాగిన తర్వాత యుగంధర్ పడక కుర్చీలో పడుకుని "రాజూ! నువ్వు వ్రాసినది నెమ్మదిగా చదువు" అని కళ్ళు మూసుకున్నాడు.

రాజు డైరీ తెరిచి చదవడం ప్రారంభించాడు. రాజు చదువుతుండగా మధ్య మధ్య ఆగమని, కాసేపు ఆలోచించి, మళ్ళీ చదవమని చెప్పాడు యుగంధర్. రాజు చదవడం పూర్తయింది.

"అవును. ఈ సంఘటనల్లో మనిషి చెయ్యడానికి వీలులేనిది లేదు. ఒకటి తప్ప" అన్నాడు యుగంధర్.

"ఏమిటది?" అడిగాడు రాజు.

"నిద్రపోతున్న లక్ష్మిని ఎత్తుకు తీసుకువెళ్ళి భోజనాల సావిడి దగ్గరున్న నడవాలో పడుకోపెట్టడం" అన్నాడు యుగంధర్.

"కొంచెం విపులీకరించండి" అన్నాడు రాజు.

"విపులీకరించడానికి ఏమున్నది? శ్రీనివాసరావు మరదలు లక్ష్మి ఇద్దరు పిల్లల తల్లి. ఆమె నిన్న రాత్రి తన గదిలో తన భర్త దగ్గర పిల్లలతో పడుకున్నది. ఒక రాత్రివేళ ఎవరో పరిగెత్తుతూ తనని తన్నినట్లయి నిద్ర మేల్కొంది. అప్పుడు నడవాలో పడుకునున్నది. నిద్రపోతున్న మనిషిని ఎత్తుకు తీసుకువెళ్ళి నడవాలో పడుకోపెట్టడం అంత సులభమైన పనికాదు. పైగా మేడమీదనించి కిందికి తీసుకురావడం మరీ కష్టం. ఎత్తుకు తీసుకు వస్తున్నప్పుడు నిద్రనించి మెలుకువ వచ్చి ఉండాలి. మెలుకువ రాకపోవడానికి ఒకే ఒక కారణం ఉంటుంది. ఆమెని ఆ మనిషి ఎత్తుకుని కిందికి తీసుకువెళ్ళే ముందు ఆమెకి మత్తు మందు యిచ్చి ఉండాలి" అన్నాడు రాజు.

"అంత సింపుల్ కాదు. లక్ష్మికి నిద్రమందు ఎవరో ఇచ్చారనుకుంటే, భర్త లేవకుండా పక్కన పడుకున్న లక్ష్మిని ఎలా తీసుకువెళ్ళారు?" తర్వాత సుబ్బమ్మ కేకలు విని అతను నిద్ర లేచినపుడు గది తలుపు తెరిచి ఉన్నదా? లక్ష్మికి నిద్రమందు ఇచ్చి ఉంటే, ఎత్తుకు తీసుకువెళుతున్నా మెలుకువ రానంతగా గాఢమైన మత్తులో ఆమె ఉండి ఉండాలి. అటువంటప్పుడు ఎవరో పరుగెత్తుతున్నట్లయి ఎలా నిద్రలేచింది?" అన్నాడు యుగంధర్.

"అవును. లక్ష్మిని ఎవరో ఎత్తుకు తీసుకువెళ్ళి పడుకోపెట్టి ఉండాలని మనం నిరూపించగలిగాలి. లేకపోతే మానవాతీతమైన శక్తి ఏదో చేసి ఉంటే మిగతావన్నీ, రామచంద్రరావు హత్య కూడా ఆ శక్తే చేసిందని అనుకోవలసి వస్తుంది" అన్నాడు రాజు.

యుగంధర్ తల ఊపి "లక్ష్మిని పిలిపించి మాట్లాడడం మంచిదనుకుంటాను" అన్నాడు.

రాజు తలుపు దగ్గరికి వెళ్ళి "క్రిష్ణమూర్తి గారూ!" అని పిలిచాడు.

క్షణంలో క్రిష్ణమూర్తి గదిలోకి వచ్చాడు. లక్ష్మితో మాట్లాడాలని యుగంధర్ చెప్పగానే, పిలుచుకువస్తానని చెప్పి వెళ్ళిపోయి కాసేపట్లో లక్ష్మిని తీసుకు వచ్చి "మా మరదలు లక్ష్మి. డిటెక్టివ్ యుగంధర్, ఆయన అసిస్టెంట్ రాజు" అని పరిచయం చేసి "నేను కూడా ఉండాలా?" అడిగాడు క్రిష్ణమూర్తి.

"అవసరంలేదు" అన్నాడు యుగంధర్.

క్రిష్ణమూర్తి వెళ్ళిపోయాడు. యుగంధర్ లక్ష్మిని పరీక్షగా చూశాడు. దబ్బపండు వంటి పచ్చని శరీరం. ఒత్తయిన నల్లని సాగి జుట్టు. తీర్చిదిద్దినట్లున్న ముఖరేఖలు. కొంచెం లావుగా ఉన్నా అందంగా ఉన్నది. ఫాషన్ ఏమీ లేదు కానీ మొగాళ్ళని ఇట్టే ఆకర్షించే రూపం ఆమెది.

"కూర్చోండి" అన్నాడు యుగంధర్.

లక్ష్మి కూర్చున్నది. "దయచేసి నిన్నరాత్రి జరిగిన విషయాలు చెప్పండి" అడిగాడు యుగంధర్.

లక్ష్మి గొంతు సవరించుకుని "రాత్రి భోజనాలు అయ్యాయి. అందరం యెవరి దారిన వాళ్ళం గదుల్లోకి వెళ్ళిపోయాం. ఇద్దరు పిల్లల్ని నిద్రపుచ్చి నేనూ పడుకున్నాను" అన్నది.

"మీవారు?" అడిగాడు యుగంధర్.

"ఆయనా పడుకున్నారు" అన్నది లక్ష్మి.

"మంచం మీదా?"

"అవును."

"మీరూ, పిల్లలూ అదే మంచం మీద పడుకున్నారా?" అడిగాడు యుగంధర్.

"అవును. పెద్ద పందిరి పట్టెమంచం అది."

"గది తలుపు గడియపెట్టారా?"

"ఆఁ ఓ రాత్రివేళ ఎవరో పరిగెత్తినట్లయి నిద్ర మెలుకువ వచ్చింది. అంతలోనే ఎవరో నన్ను కాలితో తన్నారు. ఉలిక్కిపడి లేచి యెవరన్నాను. అది పెద్దబావగారు. చూద్దును గదా నేను భోజనాల సావిడికి వెళ్ళే నడవాలో పడుకున్నాను" అన్నది లక్ష్మి.

"పడుకున్న తర్వాత మళ్ళీ నడవాలో నిద్రలేచేంతవరకూ ఒకసారి కూడా మెలుకువ రాలేదా?"

"లేదు."

"మీ చెయ్యి ఇలా ఇవ్వండి. నాడి పరీక్ష చేయాలి" అన్నాడు యుగంధర్. లక్ష్మి చెయ్యి అందించింది.

నాడి పరీక్ష చేసి, నాలిక పరీక్ష చేసి "మీరు వెళ్ళవచ్చు. దయచేసి మీ భర్తను ఒకసారి ఇలా రమ్మంటారా?" అన్నాడు యుగంధర్. లక్ష్మి గదిలోంచి వెళ్ళగానే యుగంధర్ తల తిప్పి "నో! నిద్రమందు లక్షణాలు ఏవీ లేవు" అన్నాడు.

"నన్ను పిలిచారా?" అంటూ ప్రభాకరరావు తలుపు వద్దకు వచ్చి నిలబడ్డాడు.

"అవును. లోపలికి రండి. ఒకటి రెండు విషయాలు మిమ్మల్ని అడిగి తెలుసుకునేందుకు పిలిచాను. నిన్నరాత్రి జరిగిన విషయాలు దయచేసి వివరంగా చెపుతారా?" అడిగాడు యుగంధర్.

"ఏముంది చెప్పడానికి సుబ్బమ్మ పొలికేకలు విని ఉలిక్కిపడి నిద్రలేచాను. అమాంతం మంచం మీదనించి ఒక గంతువేసి కిందికి పరిగెత్తాను. అప్పటికే శీను అన్నయ్య, కిట్టూ అన్నయ్య అక్కడ ఉన్నారు. వీరయ్య ఒంటిగా తోటలోకి వెళ్ళడానికి భయపడుతుంటే-"

"కొంచెం ఆగండి. భోజనాలయ్యాక మీరూ, మీ ఆవిడా మీ గదిలోకి వెళ్ళారు. వెంటనే నిద్రపోయారా?" అడిగాడు యుగంధర్.

"వెంటనే నిద్రపోయి ఉండను. పడుకున్నాను. అరగంట తర్వాత నిద్రపట్టి ఉంటుంది.

"సుబ్బమ్మ కేకలు విని నిద్రలేచారు. ఆలోగా నిద్రలేవలేదా?"

"లేదు."

"కేకలు వినగానే నిద్రలేచారు. అప్పుడు మీ ఆవిడ మీ పక్కన ఉన్నదో లేదో చూడలేదా?" అడిగాడు యుగంధర్.

"ఓ వైపు నేనూ, ఇంకో వైపు మా ఆవిడా, మధ్యన పిల్లలు పడుకున్నాం. కేకలు వినిపించగానే ఏదో అవాంతరం జరిగిందని అమాంతం లేచి పరిగెత్తాను. మా ఆవిడ ఉన్నదో లేదో చూడలేదు. చూడాలని స్ఫురించలేదు" అన్నాడు ప్రభాకరరావు.

"మీ గది తలుపు లోపల గడియ వేసి ఉందా, తీసి ఉందా?" అడిగాడు యుగంధర్. ప్రభాకరరావు క్షణం ఆలోచించి "వేసి ఉన్నది" అన్నాడు.

"సరిగా జ్ఞాపకమున్నదా?"

"ఆ! స్పష్టంగా జ్ఞాపకమున్నది. గడియ తీసి, తలుపు తెరుచుకుని బయటికి వెళ్ళాను" అన్నాడు ప్రభాకరరావు.

"మీ గదిలోంచి బయటికి ఇంకో తలుపు ఉందా?"

"లేదు"

"ఒకసారి మీ గది చూపిస్తారా?" అడిగాడు యుగంధర్.

"రండి" అన్నాడు ప్రభాకరరావు.

*(కొనసాగింపు వచ్చేసంచికలో)*

Post your comments